
ఈ వారం తెలుగు పుస్తకం

# తెలంగాణా ఆత్మ, గౌరవ సూచిక
# "గోలకొండ కవుల సంచిక"

పెన్నా శివరామకృష్ణ




**Titile:** Golakonda Kavula Sanchika
**Author:** Suravaram Pratapa Reddy
**Subject:** SPECIAL ISSUES
**Year of Publication:** 2002
**Price:** USD $ 11.57

సురవరం ప్రతాప రెడ్డిగారి ప్రస్తావన లేకుండా గత శతాబ్ది పూర్వభాగపు తెలంగాణా సాహిత్యాన్ని గూర్చి మాట్లాడడం అసాధ్యం. 'గోలకొండ' ప్రస్తావన లేకుండా సురవరం వారిని గూర్చి మాట్లాడడమూ కుదరదు. ఆధునిక తెలంగాణా సాహిత్య ప్రస్థానంలో 'గోలకొండ కవుల సంచిక' ఒక మైలురాయి. 10.5.1926 న 'గోలకొండ' పత్రిక ప్రారంభింప బడింది. (స్థాపకులు : రాజా వెంకటరామరెడ్డి). అది చాలా కాలం ద్వైవార పత్రికగా వెలువడింది. 1947 లో దిన పత్రికగా మారింది. 1966 లో ప్రచురణ నిలిచిపోయింది. 'ఆంధ్రమాత' అనే పత్రికను మాడపాటి హనుమంతరావుగారు స్థాపించడానికి ప్రయత్నించగా దానికి ప్రభుత్వం అనుమతించలేదు. 'ఆంధ్ర' అనే పదం ఉంటే ఆ పత్రికకు అనుమతి లభించదేమోనని, కుతుబ్‌షాహీ ల కాలం స్ఫురించే విధంగా 'గోలకొండ' అనే పేరు పెట్టారు. 'ఆంధ్ర భాషా సాహిత్యాల పోషణలో గోలకొండ సుల్తానులు, కుతుబ్‌షాహీలు ఎంతో కృషి చేసారని అసఫ్ జాహీలు అందుకు విరుద్ధంగా నిరాదరించారని ప్రతాపరెడ్డి భావించారు."

-'షబ్నవీస్'- తెలంగాణ పత్రికా రంగ చరిత్ర. పుట.67-సంగిశెట్టి శ్రీనివాస్

ప్రతాపరెడ్డిగారు న్యాయవాద వృత్తిలో ఉండటం వల్ల పత్రికా సంపాదకులుగా ఉండకూడదన్న నియమాన్ని దృష్టిలో ఉంచుకొని కొండా బాలకృష్ణారెడ్డిగారిని సంపాదకులుగా నియమించారు. కాని సురవరంవారే సంపాదకత్వం నుండి గుమాస్తా, ప్రూఫ్ రీడర్ దాకా అన్ని పనులూ చూసుకునేవారట. 3-8-1939 నుండి ప్రతాప రెడ్డిగారు ప్రత్యక్షంగా సంపాదకులైనారు. 'గోలకొండ' నిజాం రాష్ట్ర ఆంధ్రోద్యమానికి అండగా నిలిచింది. ప్రజల అభిప్రాయాలకు అద్దం పట్టింది. ప్రతిభావంతురాలైన కవులను, రచయితలను ప్రోత్సహించింది. స్త్రీలలో చైతన్యాన్ని కలిగించింది. స్త్రీలు రాసిన అనేక రచనలను ప్రచురించింది. ఆగస్టు 11,1947 వ తేదీ నుండి 'గోలకొండ' పత్రిక దినపత్రికగా వెలువడింది.'గోలకొండ' పత్రిక తొమ్మిదవ సంవత్సరాది సంచికలో ముద్రింపబడిన 'ఆధునిక భావ కవిత్వ తత్త్వము' అనే వ్యాసంలో రచయిత ముడుంబ వేంకట రాఘవాచార్యులు

"నిజాం రాష్ట్రంలో ఆంధ్ర కవులు పూజ్యము" అని రాశారు. ఆ వ్యాసం నుంచి ఈ వాక్యాన్ని తొలగిస్తే మంచిదని ఇల్లిందల సీతారామారావుగారు అభిప్రాయపడినారని, ఆదిరాజు వీరభద్రరావుగారు అందుకు అంగీకరించలేదని అంటారు. అంతకు ముందు కూడ ఇలాంటి మాటలు అన్నవారున్నారు. "ఇచ్చటి పరిస్థితులు దెలియక, తెలిసికొనుట కవకాశం లేకపోవటం వల్లనే రాఘవాచార్యుల వారామాట అన్నారు. కాని ద్వేష బుద్ధితో కాద"ని పలకటం సురవరం వారి సహృదయత. ముడంబవారి మాటలు నిరాధారమైనవని, వాస్తవ విరుద్ధమైనవని నిరూపించటానికి 'గోలకొండ కవుల సంచిక' ప్రచురణకు పూనుకున్నారు. (ప్రథమ ముద్రణ: డిసెంబరు 1934 )'గోలకొండ' పత్రికలో 'సంచిక' ప్రచురణను గూర్చిన ప్రకటనకు సంబంధించి వందలాది మంది కవులు రచనలను పంపారు. 354 మంది కవుల రచనలను ఎన్నిక చేసి ప్రచురించారు. వీటిలో 72 సంస్కృత రచనలు. మొత్తం 237 సంస్కృత శ్లోకాలు, 1181 తెలుగు పద్యాలు ఈ సంచికలో ఉన్నాయి. సాంప్రదాయకమైన పద్య కవిత్వమే ప్రధాన స్రవంతిగా ఉన్నరోజులవి. కనుక పద్యకవులు లేరన్నదే రాఘవాచార్యులవారి అభిప్రాయం. బహుశా అందుకే పద్యకవిత్వాన్నే సంకలనం చేశారనుకోవాలి. తెలంగాణ పండితులను న్యూనత పరచిన వారికి తగిన సమాధానం చెప్పటానికి , తెలంగాణా కవి పండితుల ఉభయభాషా ప్రౌఢిని నిరూపించటానికి సంస్కృత రచనలను కూడ చేర్చారు. "ఈ సమయమును బురస్కరించుకొని సంస్కృతాంధ్రములకు సమాన గౌరవముల నియ్య నుద్దేశించితిమి" అని సురవరం వారు తమ ప్రకటనలో ప్రత్యేకంగా తెలిపారు. "ఈ సమయమును బురస్కరించుకుని " అనే వారి మాటలలోని అంతరార్థాన్ని గమనిస్తే సంస్కృత కవిత్వాన్ని చేర్చటంలోని ఔచిత్యం తెలుస్తుంది,

తెలంగాణలో అసంఖ్యాకంగా పండితులు, కవులు ఉన్నారని, ప్రచురణకు, ప్రచారానికి తగిన అవకాశాలు లేకపోవడం వలన, ఇంకా అనేక ఇతర కారణాల వలన అజ్ఞాతంగానే ఉండిపోయారని తెలియజెప్పడం సంపాదకుల ప్రధాన లక్ష్యం. అందువల్ల ఇది 'గోలకొండ కవుల సంచిక" మాత్రమే కాని "గోలకొండ కవిత్వ సంచిక" కాదని గమనించాలి. ఈ సంచికలోని రచనల కవిత్వ ప్రమాణాన్ని నిర్ణయించేది కాకపోయినా ఈ అంశాన్ని పాఠకులు దృష్టిలో ఉంచుకోవాలి. తెలుగు భాషా సాహిత్యాలు ఏమాత్రం ఆదరాభిమానాలకు నోచకోని కాలంలో, మరోవైపు 'తెలంగీ బేడంగీ' (తెలుగు ముక్కు మొహం లేని భాష) అని తెలుగు భాష హేళనకు గురైన కాలంలో వెలువడిన ఈ సంచిక కవులకు ఎంతటి ఆనందోత్సాహాన్ని కలిగించిందో 'సంచిక ప్రశంస' విభాగంలోని రచనల ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రతాపరెడ్డిగారు 1921 లో తాను రచించిన " ఉచ్ఛల విషాదం" అనే నాటకంలో "కావవే ధర హైందవాళుల కష్టజాలము పోవుచున్, భావనంబగు నార్యభూమి ప్రవర్ధమానము గాంచుతున్" అంటూ కొన్ని 'ముత్యాల సరాలు' రాసారు. తెలంగాణలో పద్యేతర కవిత్వపు ప్రక్రియలు నాటికి ప్రాచుర్యం పొందక పోయినా పూర్తిగా లేవని చెప్పలేం. ఈ సంచికలోని "ఉషః కాలము (పుట.250) లాంటి ముత్యాల సరాలే ఇందుకు సాక్ష్యం. సంచికలోని కవులను గూర్చి "వీరందరు 'కవి' యను నామమునకు నర్హులా?" అని ఎవరైనా శంకిస్తారేమోనని ఊహించి "కవి యను పదమును సర్వ సాధారణముగా నన్వయించు నర్థమునందే మా యీ కవుల యెడల నన్వయించుచున్నాము. " అని వివరణ నిచ్చారు రెడ్డిగారు.

రచనలను స్తోత్రములు, మహాపురుష ప్రశంస, శృంగారము, హితోపదేశము, సంచికా ప్రశంస, వివిధ

వర్ణనలు, కథాలహరి, ప్రబోధము, నిజాం రాష్ట్ర ప్రశంస, కవిత్వతత్త్వము అంటూ విషయాల వారీగా విభజించారు. ఈ విభాగాల ప్రచురణ అనంతరం అందిన రచనలను 'సంకీర్ణము' పేరుతో చివరన చేర్చారు. "ఈ సంచిక శాశ్వతమగు చారిత్రకపు కవితగా" ఉంటుందన్న సురవరం వారి దూరదృష్టి గమనించదగినది.

అందుకే ఈయన వీలైనన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు. కవితల ఎన్నికలో వస్తు రూపాల పరంగా వైవిధ్యానికి ప్రాధాన్యమిచ్చారు. వివిధ జాతి, వర్ణ, వర్గ, కుల, మత, లింగ ప్రాంతాల విషయంలో సమతౌల్యం కోసం ప్రయత్నించారు. పదిమంది కవయిత్రుల రచనలు ఇందులో ఉన్నాయి. ఈ సంచికలోని కవులు నిజాం రాష్ట్రంలో భాగాలైన రాయచూరు,గుల్బర్గా జిల్లాలతో పాటు పది జిల్లాలకు చెందినవారు. ఇందులో మహబూబ్ నగర్ (87), వరంగల్లు (85), నల్లగొండ (57) జిల్లాల కవుల రచనలు ఎక్కువగా ఉండడం ఈ మూడు జిల్లాలలోని సాహిత్య, సామాజిక చైతన్యానికి నిదర్శనం. తెలంగాణ విమోచనోద్యమంలోనూ ఈ మూడు జిల్లాలు గణనీయమైన పాత్ర వహించాయి. వ్యాకరణ, జ్యోతిష, తర్క, వేదాంత శాస్త్రాలలో పండిత సభలను నిర్వహించి 'విద్వద్గద్వాల' గా పేరు పొందిన గద్వాల సంస్థానాధీశుల సాహిత్య పోషణ కూడా చెప్పుకోదగినది. ఆత్మకూరు, జటప్రోలు, దోమకొండ మొదలైన సంస్థానాలు సాహిత్య జ్యోతిని ఆరకుండా కాపాడినాయి.

18 కులాలకు (ఉపకులాలకు) చెందిన వారితో పాటు ముగ్గురు ముసల్మానులు, ముగ్గురు క్రైస్తవులు కూడ ఉండడం విశేషం. కుల, మత పరమైన పక్షపాతంతో వ్యవహరించిన ఇతర తెలుగు కవిత్వ సంకలన కర్తలతో పోల్చి చూస్తే రెడ్డిగారి గొప్పతనం తెలుస్తుంది. మొత్తం కవులలో 250 మంది వివిధ శాఖలకు చెందిన బ్రాహ్మణులు. వీరిలో వైదికులు నాలుగవ వంతు మాత్రమే ఉన్నారు. నాటి వైదికులలో అధిక శాతం "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అనే భావం కలిగి ఉండటమే కారణమేమో? తెలియదు.

విషయ సూచిక స్థానంలో 'కవినామ సూచిక' ను చేర్చి విషయానికంటే కవులకే ప్రాధాన్యమిస్తున్నట్లు సూచించారు. అకారాది క్రమంలో కవుల పేర్లను , వారి రచనలున్న పుటల సంఖ్యను తెలిపారు. గ్రంథం చివర ఇవ్వ బడిన 'కవి పరిచయాల' లో జన్మస్థానం, జననం, ముద్రితాముద్రిత రచనల పట్టిక మొదలైన వివరాలతో పాటు కులాన్ని కూడ పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన 184 మంది పూర్వ కవుల వివరాలను కూడ అకారాది క్రమంలో గ్రంథాంతంలో జతపరిచారు. "భావి కాలములో కవుల ఛాయా ప్రకృతులెంత విలువ కలవిగా నుంటవో చెప్పనవసరములేదు." అని గ్రహించిన వారు కనుక సంచికలో 32 మంది కవుల ఛాయా చిత్రాలను ముద్రించారు. నాటికి 200 సంవత్సరాల పూర్వం వారైన మరో ముగ్గురు కవుల అపురూప "చిత్ర లేఖన ప్రతిబింబములు" కూడ ముద్రించారు. దూరదృష్టి కలిగిన, పరిపూర్ణతను కోరుకునే పరిణత పరిశోధకుని తత్వానికి ఇవన్నీ తార్కాణాలు. రెడ్డిగారు తెలంగాణా వైతాళికులలో ఒకరు. తెలంగాణా సాహిత్య అస్తిత్వవాద ఉద్యమానికి ఆద్యుడుగా కూడ వీరి స్థానం పదిలం.

స్త్రీ విద్య ఆవశ్యకత, బాల్య వివాహాల నిషేధం, వితంతు వివాహాలకు ప్రోత్సాహం, అస్పృశ్యతా నివారణ, గ్రంథాలయోద్యమం, స్వాతంత్ర్య సంగ్రామం మొదలైన అనేక అంశాల మీద రాసిన నాటి కవుల సామాజిక చైతన్యం తక్కువేం కాదు. 1930 మార్చి 3,4,5 తేదీలలో జోగిపేటలో జరిగిన మొదటి ఆంధ్ర మహాసభలోనూ, దానికి అనుబంధంగా నిర్వహింపబడిన మహిళా సభలోనూ సంఘసంస్కరణ, స్త్రీ విద్య మొదలైన అంశాలే

ప్రధానంగా చర్చింపబడినాయి. "అంగీకరింపబడిన 32 తీర్మానములలో ఎక్కువ భాగము విద్యకును సంఘసంస్కరణకును సంబంధించినవి. మొట్ట మొదటిదగు నీ మహాసభలో సంఘసంస్కరణ విషయము ఎక్కువగా దృష్టినాకర్షించినట్లు కానవచ్చుచున్నది. ఆ కాలమున, హైదరాబాదు శాసనసభలో అతి బాల్య వివాహములు నిషేధించినట్టియు, వితంతోద్వాహము నంగీకరించునట్టియు, రెండు చిత్తు శాసనములు సభలో చర్చింపబడినవి.... " ఆది హిందువు (హరిజను) ల విద్యాసౌకార్యాదులను పెంపొందించుటకు తగిన ప్రయత్నములను జేయుటకై ప్రభుత్వము వారిని, అంటరాని తనము తొలగించుటకై ప్రజలను నీ మహాసభవారు కోరుచున్నారు" అను తీర్మానమును అప్పటి హరిజన నాయకుడగు శ్రీ మా.వెం.భాగ్యరెడ్డి వర్మగారు ప్రవేశపెట్టిరి. ఇది యంగీకరింపబడెను." అని మాడపాటివారు తెలిపారు.

- తెలంగాణా ఆంధ్రోద్యమము-రెండవ భాగం. పుట.10

తెలంగాణా ప్రజలను జాగృతం చేసిన గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహాసభల నేపథ్యంలో, నాటి రాజకీయ, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ఈ కవిత్వాన్ని పరిశీలించాలి.

భావ కవిత్వ సాంప్రదాయమును గ్రహించి ఆంధ్రభారతినుపాసించుచున్న నవయువ కవులును అనేకులు గలరు.'' అని ప్రతాపరెడ్డిగారన్నారు. కాని నాటి తెలంగాణా కవుల పైన భావ కవిత్వ ప్రభావం మృగ్యమేననిపిస్తుంది. ఈ సంచికలోని 'శృంగారం' అనే విభాగంలోని రచనలు కూడ ప్రబంధ వర్ణనల ఛాయలలోనే ఉన్నాయి. నాటి పాలకులను, పాలనా పద్ధతిని ప్రత్యక్షంగా నిరసించిన దాఖలాలు ఈ సంచికలో కనిపించవు. పైగా "ప్రతిభ గాంచిన యట్టి ప్రభువరుండుస్మాన్ సుధీవరుండే లెడి దివ్య భూమి" అంటూ కొందరు ప్రశంసించారు. "గస్తీ నెం.53" గా పిలువబడే నిషేధాజ్ఞ ద్వారా నిజాం ప్రభుత్వం రాజకీయ సమావేశాలను నిషేధించింది. రాజకీయాల జోలికి పోకుండా ఉండాలన్న నిబంధనతోనే ఆంధ్ర మహాసభల నిర్వహణకు పాలకులు అనుమతి నిచ్చారని గమనిస్తే ఈనాటి వాక్ సభా స్వాతంత్ర్యాదుల పరిస్థితి తెలుస్తుంది. నాటి నిర్బంధ స్థితిని "వాగ్బంధన శాసన శృంగార తాండవ విశేషము"ని సురవరం వారు వర్ణించేవారట.

-తెలుగు వైతాళికులు - నాలుగవ సంపుటం. పుట.74 (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ)

'పంక్తుల మధ్య ' చదువుకుంటే నాటి కవుల అభిప్రాయాలు మరింత బాగా అర్థమవుతాయి. చెప్పిన విషయాలను బట్టి ప్రత్యక్షంగా చెప్పబడని అనేక అంశాలను గ్రహించవచ్చు. సూటిగా ఎందుకు చెప్పలేకపోయారో ఊహించవచ్చు.

"స్తోత్రములు" అనే విభాగంలో వివిధ దైవస్తుతులు 93 ఉన్నాయి.

ధారాధర ప్రవర నీరాజనీయ రుచి పూరాయ లోక గురవే
ఘోరాహిత క్షుభిత సారామరాధిపతి సారాజ్య కల్పతరవే
నారాయణాయ ఘన సారావభాసి రుచి ధారాళ భవ్య యశసే
పారాశరీంద్ర కలితారాధనాయనతి రారాదుదాత్త మహసే" (పుట-1)

"సముచిత గుణజాలం సర్వలోకైక పాలం/రుచిర కనక చేలం రుక్మిణీ కాంతలోలం
దళిత దనుజ జాలం ధర్మరక్షైక శీలం/ నతముని హృదిలోలం నౌమి గోపాల బాలం" (పుట-54)

శబ్దాలంకార శోభితమై, భక్తి భావ గంభీరమైన వర్ణనలతో కూడిన ఇలాంటి స్తుతులు పూర్వ మహర్షుల ఆచార్యుల స్తోత్ర సాహిత్యానికి సాటి రాగలిగినవి.

'మహా పురుషప్రశంస' అనే విభాగంలో ప్రాచీన తెలుగు కవులతో స్థానికులైన ప్రముఖులను కూడ ప్రశంసిస్తూ రాసిన ఖండికలున్నాయి.

శ్రీ మన్నా మా సుగుణ
స్తోమా యేసూ ! పవిత్ర శోభిత నామా
భూమీ జన రక్షణ స
న్నామా విస్ఫురిత భూషణ స్థిత ప్రేమా (పుట.103)

అంటూ శ్రీకారంతో ప్రారంభించి రెవరెండు యం.వై.జీవరత్నంగారు చేసిన 'ఏసుక్రీస్తు' ప్రశంస ఆకర్షిస్తుంది. నిజానికి ఈ రచన 'స్తోత్రముల'లో చేర్చవలసింది.

త్రుంచినవాడవు కఠిన ! నా దోషమేమి
విడువలేవె జీవంబుల వీడువరకు
శాఖలో దుఃఖ పర్యవసాన మిట్టి
ముఱిపెమని నేనెరింగిన ముడువకుందు
స్వాంత హరుడగు పవను గిల్గింతలకును
చారు రుచిహీన మయ్యెడు శాఖమద్వి
యోగమున నక్కటా తల్లియొడిని బిడ్డ
బాసి కన్నీరు నించునన్ బడయలేక
తేనెటీగలు చింతించు దీర్ఘ దుఃఖ
వార్ధిలో మున్గ గోకిలల్ బంభరములు (పుట.188)

కోదాటి రామకృష్ణారావుగారి 'సుమ విలాపము' అనే ఖండికలోని పద్యాలివి. కఠినాత్ముడా ! నేనే దోషం చేశానని త్రుంచినావు ? నేను శాఖనుంచి రాలేవరకు ఆగలేవా? ఆనందానికి దుఃఖమే పర్యవసానమని తెలిస్తే గాలి కలిగించిన గిలిగింతలకు మురిసే దానినే కాదు,అంటూ పుష్పం దుఃఖిస్తున్నది. పుష్పంలోని పరిమళాన్ని గాలి మోసుకు వెళుతుందనే భావాన్ని స్ఫురింపజేస్తూ 'స్వాంతహరుడ'నటం సార్థకం. త్రుంచటం వలన తనకు బాధ కలుగుతోందన్నదని కాక కొమ్మ కాంతి విహీనమవుతుందని తేనెటీగలు, కోకిలలు దుఃఖిస్తాయని సుమం విలపిస్తున్నది.

"కాంతిదీపిక చల్లారెగా మటంచు
శాఖ యేడ్చెడు నాకును జావుగలదు
చచ్చెదవు నీవు నందఱు చావగలరు
తరుణ మరణంబు జగతి కంతము గదోయి."

ప్రాణులన్నిటికి ఎప్పుడో ఒకప్పుడు మరణం తప్పదు. అకాల మరణమే దుఃఖం కలిగిస్తుంది. అసహజ

మరణాలను నిరసిస్తూ ముగియడం ఖండికలోని ఉదాత్తతను మరింత పెంచింది. "కరుణశ్రీ రాసిన 'పుష్పవిలాపము' 1942 నాటిది. ఇది ఏ.సి.కాలేజి 1942 సంవత్సరపు మాగ్‌జైన్‌లో అచ్చయినట్లు తెలుస్తుంది."

-"తెలంగాణా భావ విపంచిక - గోలకొండ కవుల సంచిక "- డా.అనుమాండ్ల భూమయ్య. పుట.92

త్రుంచబడడం వలన తనకుకలిగే బాధ కంటే ఇతరులకు కలిగే వేదనను వ్యక్తపరచడం, అసహజ మరణాన్ని నిరసిస్తూ కొమ్మ దుఃఖించడం 'సుమవిలాపం'లోని విశిష్టత. పుష్పవిలాపాన్ని తక్కువగా చూడనవసం లేదు కాని, 'సుమవిలాపా'నికి తగిన గుర్తింపు రాకపోవడం విచారకరం. "కొమ్మనున్నట్టి పుష్పంబు గోయబోక , తావులనుగ్రోలుటుచింతంబు దాపు నుండి" అంటూ ప్రభోదించే "కుసుమాపచయము" అనేది సంచిక లోని మరో మంచి రచన. దీనిని రచించిన కవి యం.వి.మాధవరావుగారు (పుట.200)

గార్లపాటి రాఘవరెడ్డి, వానమామలై వరదాచార్యులు, వానమామలై జగన్నాథాచార్యులు, రంగరాజు కేశవరావు, గుండేరావు హర్కారే, ఒద్దిరాజు సోదరులు, కేశవపంతుల నరసింహశాస్త్రి మొదలైన ప్రసిద్ధ పండితుల కవుల తొలినాళ్ళ రచనలను ఈ సంచికలో చూడగలం.

"దుర్భరమగు శోకవార్ధిబడి వందరుచున్నది భారతాంబ" అంటూ భారతాంబ దుఃఖాన్ని తొలగించడానికి శివాజీని తిరిగి పంపమని భగవంతుడిని ప్రార్థించాడు మరోకవి. శివాజీని హిందూమత రక్షకునిగానే కాక "స్వాతంత్ర్య సాహససాధన సంపత్తి గాంచుట కీవకారణంబు" అంటూ స్వాతంత్ర్య కాంక్షను పరోక్షంగా వ్యక్తపరిచాడు.

"మాల మాద్గులన్య మతముల జేరిరి/ ధేడ్ చమారటంచు దిట్టు కతన
దేశమతము దిక్కు ధేడ్ చమార్లే కదా/ రక్తబంధులార రైతులార"
"హిందుమతము జీవహింసను నోర్వదా/ మాలమాద్గులన్న మండిపడును
దననుహింసజేయదగసలాములజేయు/రక్తబంధులార రైతులార " - (పుట.295)

అరిగే రామస్వామిగారి పద్యాలివి. 1971 లో హైదరాబాదు, సికిందరాబాదు జంటనగరాలు కేంద్రంగా ప్రారంభమైన ఆది హిందూ ఉద్యమంలో భాగ్యరెడ్డి వర్మతో కలసి ఉద్యమవ్యాప్తికి కృషి చేసారు రామస్వామిగారు. వీరు రైల్వేలో చాలాకాలం ఉద్యోగం చేశారు. హైదరాబాదు మున్సిపాలిటీలో సభ్యులైనారు. ఈ ఉద్యమ ప్రభావం వల్లనే 1931 జనాభా లెక్కలలో నిజాం ప్రభుత్వం అస్పృశ్య కులాలన్నిటిని ఆది హిందు జాబితాలో చేర్చింది.

-నల్ల పొద్దు - దళిత స్త్రీల సాహిత్యం - 1921-2002. పుట.10 (సంపాదకులు : గోగు శ్యామల)

"పుట్టినప్పటి నుండి వెట్టి చాకిరి జేయ
శారీర బలమెల్ల సమసిపోయె
గులకాంత పగలెల్ల గూలి జేసినగాని
యొక్క పూటకె తిండి చిక్కదాయె
గొడుకు గష్టించియు గొలువు జేసిన గాని
కట్టుటకై గుడ్డ కరువు వచ్చె ......" - (పుట.291)

అంటూ జొన్నలగడ్డ హనుమంతరెడ్డి గారు "హరిజన దీనాలాపముల" ను వినిపించారు.నాడు బడుగు వర్గాలను బాధించిన సమస్యలలో ' వెట్టిచాకిరి' ఒకటి. వివిధ చేతి వృత్తుల వారితోపాటు మాల, మాదిగలకు

'బలోతా ఇనాం' (చాకిరీ ఇనాం) లు ఇచ్చారు. ఈ ఇనాం భూములకు ప్రతిఫలంగా ఇంటికొక వ్యక్తి వెట్టి చాకిరీ చేయవలసి వచ్చేది. గ్రామాధికారుల ఇండ్లలో అన్ని రకాల పనులు చేయాలి. వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా కొంత ఆందోళన చేసిన తర్వాత కోసెడు దూరం బరువులు మోస్తే 'కోసుకు వీసం' ఇవ్వాలని ఫర్మానా చేయబడింది. అది కూడా సరిగా ఇచ్చేవారు కాదు. వెట్టి బరువులు మోయడానికి పరిమితమైనదే కాదు. ఇనాం భూములను తీసుకొన్నందుకు చాకిరీ చేయడం న్యాయ సమ్మతం కాదని వివరిస్తూ వడ్లకొండ నరసింహారావుగారు 'వెట్టిచాకిరీ' అనే పుస్తకం రాశారు. వీరు 1921లో ఏర్పడిన నిజాం రాష్ట్రాంధ్ర జన సంఘానికి తొలి కార్యదర్శిగా పని చేసారు. వీరు ఆనాటి కథా రచయిత్రి నందగిరి ఇందిరాదేవి తండ్రి.

గాంధీజీ ఆంధ్రదేశ పర్యటనలో భాగంగా మొదటిసారిగా 1-4-1919 న హైదరాబాద్ వచ్చారు. గోవిందరాజులు నాయుడు ఇంటికి వెళ్ళిన గాంధీజీని వామన్‌రావు నాయక్ కలుసుకున్నారు. సహాయ నిరాకరణోద్యమానికి మందు బొంబాయికి వెళుతూ 24-8-1920 న సికింద్రాబాదు రైల్వేస్టేషన్‌లో కొంతసేపు ఆగిన గాంధీజీని నాలుగువేల మంది ప్రజలు దర్శనం చేసుకున్నారు. 6-4-1929 న హైదరాబాదుకు వచ్చి వివిధ సంస్థలను సందర్శించారు. వివిధ సభలలో ఉపన్యసించారు. 9-3-1934 న హరిజనోద్ధరణ యాత్రలో భాగంగా మరోసారి హైదరాబాదుకు వచ్చారు. సికింద్రాబాద్‌లోని కర్బలా మైదానంలో ఉపన్యసించారు. కాచిగూడలోని 'చెప్పల్ బస్తీ' కి 'హరిజన బస్తీ' అని నామకరణం చేసారు. బ్రిటిష్ ఆంధ్రలోలాగ గాంధీజీ తెలంగాణ మారుమూల ప్రాంతాలను సందర్శించలేదు. కాని 1934 వరకు నాలుగుసార్లు హైదరాబాదుకు వచ్చారు. ఇలాంటి వివరాలను దృష్టిలో పెట్టుకుంటే తెలంగాణ సాహిత్యం మీద గాంధీజీ వ్యక్తిత్వం, స్వాతంత్ర్య ఉద్యమాల ప్రభావాన్ని అర్థం చేసుకోగలం.

"శ్రీ కర్మ చంద్రోదయము" (పుట.86) అనే ఖండికలో ఆచ్చి వేంకట నృసింహాచార్యులవారు గాంధీజీ నిరాడంబరమైన వేష, భాషలను, ఉపన్యాస దీక్షలను, హరిజనాభ్యుదయ లక్ష్యాన్ని, ఆసేతు శీత నగ పర్యంతం వ్యాపించిన కీర్తిని శ్లాఘిస్తూ ఆయన ప్రయత్నం సఫలం కావాలని కాంక్షించాడు. కరంచంద్‌ను 'కర్మచంద్రుడ' ని తన అభిమానాన్ని ప్రకటించాడు.పుతంబాక దుర్గా ప్రసాదరావుగారు గాంధీకి 'జోహార్' చెప్పతూ అస్పృశ్యతా నివారణోద్యమాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నాడు. దేశవ్యాప్తంగా జరిగిన శాసనోల్లంఘన, సత్యాగ్రహ పోరాటాలు ఇక్కడి మితవాద నాయకులను కదిలించలేకపోయినా యువకుల హృదయాల నాకర్షించాయి. 1934 నాటికే కాంగ్రెస్ రాజకీయాలు గాంధీజీ వ్యక్తిత్వం తెలంగాణా వారిని కూడ ప్రభావితం చేశాయి.

1932 ప్రాంతంలో గాంధీ ఎరవాడ జైలునుంచి విడుదల కాగానే హరిజనోద్యమాన్ని చేపట్టడం, ఘనశ్యామ్ బిర్లా అధ్యక్షతన 'హరిజన సేవా సంఘా' న్ని ఏర్పరచటం, వామన్‌రావు నాయక్ అధ్యక్షతన ఈ సంఘానికి హైదరాబాదు సంస్థాన శాఖ కూడా ఏర్పడటం మొదలైన అంశాల నేపథ్యాన్ని గమనించాలి.

"ధనపతి యెవ్వడొ తనదు తండ్రికి ద్రోహముసేయ క్షాత్రులౌ
పురుషుల మాత్రమే దునిమె బూనిక భార్గవరాముడా తటిన్
దరచుగ ప్లేగు తండ్రికిన్ దాతకు నే నరుడేమి చేసెనో
వరుసగ మ్రింగనాయె ప్రతివారిని జాలియొకింత లేకయున్"             - (పుట.183)

1911 లో హైదరాబాద్ నగరంలో ప్లేగు వ్యాపించింది. వేలాదిమంది చనిపోయారు. ఒక రాజెవరో తన తండ్రికి ద్రోహం చేశాడని రాజులైన పురుషులను మాత్రమే చంపివేశాడు భార్గవరాముడు. ఈ ప్లేగుయొక్క తాతకు, తండ్రికి ఈ మనుషులేం చేశారనో నిర్దాక్షిణ్యంగా అందరినీ పొట్టన బెట్టుకొంటోందని వాపోయాడు 'హైదరాబాదు ప్లేగు' అనే ఖండికలో కె.ఎస్.జాషువా అనే కవి.

"కాంతలు మాతృభాషపై గౌరవముంచక నన్య భాష నశ్రాంతము నేర్చినంతటను సారము లేదు."అంటూస్త్రీలు మాతృభాషను కాదని పరభాష నేర్చుకోవటం మంగళసూత్రాన్ని పారేసి ఆభరణాలు ధరించినట్లు ఉంటుందన్నది పులిగోటి ఆనందమాయి అనే కవయిత్రి. అవధానం చేసే స్త్రీలు అరుదు.ఈ సంచిక ముద్రించే నాటికి 12 సం॥ల వయస్సు మాత్రమే కలిగిన ఈమె అష్టావధానం చేసేదట.

"కొమ్మయో మది పూల రెమ్మయో బంగారు
బొమ్మయో తోచె కందమ్ములకును
ఇంతియో వలరాజ దంతి యో నతని చే
బంతియో వింత నాస్వాంతమునకు
చానయో యవమమృతంపుసోనయో ముద్దుల
బానయో చెదరె నా మానసంబు...." -(పుట.336)

'రమణి' అనే శీర్షికన గల పద్య భాగమిది. కవి దేవరకొండ నివాసియైన సయ్యదలీగారు. కవి పేరు చెప్పకపోతే ఈ పద్యం ఏ ప్రాచీన ప్రబంధంలోదో అనిపిస్తుంది. వీరి సోదరులు అజ్మతుల్లాగారి రచన కూడ ఈ సంచికలో ఉంది. అజ్మతుల్లాగారు మూడు కావ్యాలు, సయ్యదలీగారు 19 కావ్యాలు రాశారు. హిందూ పౌరాణిక, సాంఘిక ఇతివృత్తాలలో రచనలు చేశారు. అన్నీ అముద్రితాలే. ఇంకా ఈ సంచికలో 130 మంది కవులు బహు గ్రంథ కర్తలు. అనేకం అముద్రితాలే.

ఒద్దిరాజు సీతారామచంద్రరావుగాని జననము సర్వజిత్ సం॥ చైత్రశుద్ధ నవమి శనివారం, పునర్వసు నక్షత్రం (2-4-1887). -తెలుగు వైతాళికులు - నాలుగవ సంపుటం. పుట.102

కాని ఈ సంచికలో కార్తీక బహుళ షష్ఠి అని ఉన్నది. XII పేజీలో గడియారం రామకృష్ణశర్మగారి ఫోటో కింద గడియారం రామరాజు అని ప్రచురింపబడింది. ఈ సంచికలో ఇలాంటి ఒకటి రెండు నెరసులు లేకపోలేదు. తెలంగాణా నుంచి వెలువడిన మొదటి స్వతంత్ర తెలుగు పత్రిక అయిన "హిత బోధిని" (మాస పత్రిక) లో 27 పద్యాల ఖండిక ఒకటి ప్రచురింపబడింది. ఈ ఖండికను రచించిన రత్నమాంబా దేశాయిని తొలి తెలంగాణా కవయిత్రిగా పరిశోధకులు పేర్కొన్నారు. ఆమె రచన ఏదీ ఈ సంచికలో ఎందుకు లేదో తెలియదు.

-షబ్నవీసు- తెలంగాణ పత్రికా రంగ చరిత్ర - పుట.30

రాజపోషణ లభించిన కాలంలోని తెలంగాణా సాహిత్య స్థితికి, తదనంతర కాలంలోని స్థితికి గల భేదాన్ని పరిశీలించాలి. "ఆంధ్ర కవుల ప్రజ్ఞా పాండితీ విభవములు నివురుగప్పిన నిప్ప వలె" ఉండటానికి కారణాలేమిటో మరింత వివరంగా తెలుసుకోవాలి. 'తొలినాటి తెలుగు కథల' లాగనే తొలినాటి వచన, గేయ కవిత్వమూ, వచన రచనలూ వెలుగులోకి రావాలి. అప్పడే సంఘసంస్కరణ దృష్టినుంచి రాచరికానికి వ్యతిరేకంగా పోరాట

రూపంగా తెలంగాణా సాహిత్యం పరిణమించిన తీరు స్పష్టమవుతుంది.

1900 నుండి 1940 ప్రాంతం వరకు తెలంగాణాలోని వాస్తవిక సామాజిక స్థితిగతులు, ప్రజలలో చైతన్య వికాసం కోసం వివిధ రంగాలలో జరిగిన కృషి సరైన విధంగా నమోదు కాకపోవటం వలన, తగిన పరిశోధనలు జరగకపోవటం వలన అది తెలంగాణా సాహిత్య చరిత్రలో అంధకారయుగంగా మారిపోయింది. ఒక విమర్శకుడన్నట్లు ఆ కాలంలో తెలంగాణా లో జరిగింది 'అజ్ఞాత కోలాహలం', నిశ్శబ్ద సంరంభం'.

-"అలనాటి హైదరాబాదు సాహిత్య బృందాలు" (వ్యాసం) - కె.శ్రీనివాస్. ఆంధ్రజ్యోతి- దినపత్రిక , 9-12-2002

1900-1940 మధ్యకాలాన్ని తెలంగాణా సాహిత్య, సామాజిక చరిత్రలో సాంస్కృతిక చైతన్య వికాస దశగా పేర్కొనదగినది. ఎనిమిదవ ఆంధ్రమహాసభలు జరిగిన 1941 వ సంవత్సరాన్ని స్థూలమైన విభజన రేఖగా భావించి పరిశీలిస్తే నివురుగప్పిన నిప్పు ధర్మాగ్రహ జ్వాలగా మారిన క్రమం వెల్లడవుతుంది.

ఈ సంచికను పరిశీలనా దృష్టితో చదివితే ఇంతవరకు మనకు తెలిసిన సాహిత్య చరిత్రలు, తెలుగు సాహిత్య చరిత్రలు (?) కావచ్చు కాని తెలంగాణా సాహిత్య చరిత్రలు కావని తెలుస్తుంది. తెలంగాణా సాహిత్య పరిణామ వికాసాలు భిన్నమైనవని గమనిస్తాం. తెలంగాణా భౌగోళిక పరిస్థితులు, ఉత్పత్తి సంబంధాలు, సామాజిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో శాతవాహనుల కాలం నుండి నేటి వరకు తెలంగాణా సాహిత్యాన్ని ప్రత్యేకంగా పరిశోధించి తెలంగాణా సాహిత్య చరిత్రను నిర్మించాల్సిన అవసరముందన్న విషయం స్పష్టమవుతుంది.

తెలుగులో మొదటి బృహత్ కవితా సంకలన మనదగిన ఈ సంచికను గూర్చి తెలుగు సాహిత్య చరిత్ర కారులెంత మంది ప్రస్తావించారు? ప్రస్తావించకపోతే ఎందుకిలా జరిగిందో ఆలోచించాలి. ఆధునిక తెలంగాణా సాహిత్య చరిత్ర నిర్మాణానికి ఇది ఒక మంచి ఆకరగ్రంథం. (ఈ సంచికను విపులంగా పరిచయం చేస్తూ డా.అనుమాండ్ల భూమయ్యగారు '*తెలంగాణా భావ విపంచిక - గోలకొండ కవుల సంచిక*' అనే పుస్తకాన్ని 2000 అక్టోబరులో ప్రచురించారు.) పరిశోధకులకు ఎంతో స్ఫూర్తినిచ్చే ఈ సంచిక సంస్కృత కవిత్వా భిమానులనూ, పద్యకవితాభిమానులనూ అలరిస్తుంది, ఆలోచింపజేస్తుంది. నిశితంగా పరిశీలిస్తే ఈ సంచికలోని 'పూర్వకవి పరిచయా' నికి పీఠిక రాస్తూ శేషాద్రి రమణ కవులు "ఈ కవుల సంచిక నొక విధముగ నీ రాష్ట్రపు (నైజాం) ఆంధ్ర వాఙ్మయ నివేదిక యనవచ్చును." (పుట.390) అని అన్న మాటలు వాస్తవమని తెలుస్తుంది. ఇంతటి అపురూపమైన బృహత్ గ్రంథాన్ని వ్యయప్రయాసలకోర్చి ప్రచురించిన (ద్వితీయ ముద్రణ -ఆగస్టు 2002) ప్రచురణ కర్త కొండా లక్ష్మీకాంతరెడ్డిగారు అభినందనీయులు.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్ వదాన్య సౌజన్యంతోఅందించబడింది.